సాక్షి నిజామాబాద్

శనివారం । 21 । జనవరి । 2023



స్వాహా చేసిన సొమ్ము అందజేత

తపాల శాఖలో సొమ్ము కాజేసిన ఉద్యోగి గుట్టుచప్పుడు కాకుండా డబ్బును తిరిగి బాధితులకు అందిస్తున్నారు.

- 8లో ▸



అట్టహాసంగా టీఎల్ఎం మేళా

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో టీఎల్ఎం మేళాను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /17.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం వేళ చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

27న పరీక్షా పే చర్చ



సుభాష్‌నగర్ : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిళ్లను ఎదుర్కొనేలా పీఎం మోదీ సూచనలు అందించేందుకు, ప్రోత్సహించేందుకు ఈనెల 27న పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 5 విడతల్లో కార్యక్రమాలు నిర్వహించామని, 27న ఆరో విడత చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 15 చోట్ల పరీక్షా పే చర్చా ఏర్పాటు చేస్తున్నామని, పార్టీలకతీతంగా అందరూ పాల్గొనాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్ట్స్ అండ్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ సందేహాలను ప్రధానిని అడగాలనుకుంటే తమ సందేహాన్ని హెచ్‌డీ వీడియోని pibhyderabad@gmail.comకు పంపించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు న్యాలం రాజు, బద్దం కిషన్, సుక్క మధు, శీల శ్రీనివాస్, ఎర్రం సుధీర్, ఇప్పకాయల కిషోర్, చందుపట్ల శ్రీనివాస్, పిల్లి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల ఖాళీలు గుర్తింపు

నిజామాబాద్ అర్బన్ : టీచర్ల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా విద్యాశాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ఆయా స్కూళ్లలో ఖాళీలను గుర్తించారు. శుక్రవారం డీఈవో ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన సబ్జెక్టులు, యాజమాన్యాల వారీగా ఖాళీలను గుర్తించారు. www.deonizamabad.inలో వివరాలు చూసుకోవాలని డీఈవో పేర్కొన్నారు.

హాల్‌టిక్కెట్లపై తప్పులు సరిచూసుకోవాలి

నిజామాబాద్ అర్బన్ : టీఎస్‌పీఎస్సీ నిర్వహించే ఏఈఈ పోస్టుల రాత పరీక్షల్లో భాగంగా హాల్‌టిక్కెట్లపై తప్పులు ఉంటే సరిచూసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం పరీక్ష నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్‌లో లైజనింగ్, డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం పరీక్ష ఉంటుందని, జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎంఆర్సీ భవనాలు మంజూరు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో మండల రిసోర్సు సెంటర్(ఎంఆర్సీ) భవనాలు మంజూరయ్యాయి. జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాలకు సంబంధించిన మోపాల్, నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ రూరల్, ముప్కాల్, ఇందల్వాయి, మోస్రా, ఎర్గట్ల, చందూర్ మండలల్లో మంజూరయ్యాయి. దీనికి సంబంధించి అడ్మినిస్ట్రేషన్ అనుమతి లభించింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేశారు.

మంచిప్ప జీవో రద్దు చేయాల్సిందే!



ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ముంపు నిర్వాసితులు

- రెండ్రోజుల గడువు విధించిన రిజర్వాయర్ నిర్వాసితులు
- లేని పక్షంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి
- మాట వినకపోతే రానున్న ఎన్నికల్లో ఓడిస్తామని తీర్మానం
- పనులు నిలిపేయాలని కొండెం చెరువు వద్ద ఆందోళన

కాళేశ్వరం ప్రాజెక్ట్ 21 ప్యాకేజీలో చేపడుతున్న మంచిప్ప రిజర్వాయర్ పనుల జీవోను రెండ్రోజుల్లో రద్దు చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మద్దతుగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయాలని అల్టిమేటం జారీచేశారు. లేని పక్షంలో రానున్న ఏ ఎన్నికల్లోనైనా ఆ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయవద్దని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేయాలని తీర్మానం చేశారు. రాజీనామా చేస్తే తిరిగి గెలిపిస్తామని పేర్కొన్నారు.

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : కాళేశ్వరం ప్రాజెక్ట్ 21వ ప్యాకేజీలో భాగంగా 3.5 టీఎంసీల మంచిప్ప రిజర్వాయర్ పనుల జీవో రద్దు ప్రకటన చేసే వరకూ ఎలాంటి పనులు చేయవద్దని కాళేశ్వరం కొండెం చెరువు రిజర్వాయర్ ముంపు గ్రామకమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మంచిప్ప కొండెం చెరువు వద్ద చేపడుతున్న సర్జిపుల్ పనులు నిలిపేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకుని వచ్చిన పోలీసులు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీస్‌వాహనాన్ని నిర్వాసితులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలోని శివాజీ చౌరస్తా నుంచి నిర్వాసితులు పాదయాత్రగా కొండెం చెరువు వద్దకు తరలివెళ్లారు. ప్రాజెక్ట్ మేనేజర్ కార్యాలయ పరిసరాల్లోకి రాకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా చొచ్చుకెళ్లారు. ప్రజాసంఘాల నాయకులు పెద్ది వెంకట్రాములు, సాయాగౌడ్ మద్దతు తెలిపారు.



నిర్వాసితుల వంటా వార్పు

నేడు ఇరిగేషన్ అధికారులతో సమావేశం..

పనులు నిలిపేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలకు పూనుకున్న నిర్వాసితులకు శనివారం ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తామని హామీనివ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ప్రస్తుతం పనులు నిలిపేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు తూర్పు రాజేష్, శంకర్ నాయక్, ఈశ్వర్‌సింగ్, మ హేష్, ముత్యంరెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, భాస్కర్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దీక్షలు.. వంటావార్పు..

నిర్వాసితులు కొండెం చెరువు వద్దే దీక్షలకు పూనుకున్నారు. వంటావార్పు చేశారు. దశల వారీగా పోరాటాలకు సిద్ధమవుతామని ప్రకటించారు. జీవో రద్దు ప్రకటన చేయకపోతే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల రాజీనామాలకు ఒత్తిడి చేస్తామని, ఆ పార్టీ అభ్యర్థులకు ఓట్లేయవద్దని తీర్మానం చేశారు. రద్దు ప్రకటన చేస్తే బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించుకుంటామని తీర్మానంలో పేర్కొన్నారు.

మేనేజర్ కార్యాలయం ఎదుట బైఠాయింపు..

ప్రస్తుతం చేపడుతున్న పనులతో ఎలాంటి ముంపు ఉండదని, పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడుతున్నామని డీఈ బాల్‌రాజ్ నిర్వాసితులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఒకదశలో వారితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. సుమారు రెండు గంటలపాటు కార్యాలయం ఎదుట బైఠాయించారు. చివరకు డీఈకి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు డీఈ కూడా తామేం పనులు చేపడుతున్నామో రాతపూర్వకంగా తెలియజేశారు.



మంచిప్ప గ్రామంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఒక తప్పిదం..

- ఎస్సారెస్పీ ముంపు పరిహారం కేసు
- జప్తు కోసం కలెక్టరేట్‌కు వెళ్లిన న్యాయవాది, కోర్టు ఉద్యోగులు
- న్యూసెన్స్ చేశారని అదనపు కలెక్టర్ ఆదేశాలతో పోలీసులకు ఏవో ఫిర్యాదు
- సుమోటోగా పిటిషన్ స్వీకరించిన హైకోర్టు
- హైకోర్టు జోక్యంతో దర్యాప్తు నిలిపివేత
- ప్రభుత్వ సీఎస్, డీజీపీ సంజాయిషీ ఇవ్వాల్సిన పరిస్థితి



నిజామాబాద్ కలెక్టరేట్‌కు జప్తు కోసం వచ్చిన న్యాయవాది, కోర్టు ఉద్యోగులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు వచ్చిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మరో ఇద్దరు కోర్టు ఉద్యోగులపై కలెక్టరేట్ ఏవో కేసు నమోదు చేయించిన విషయంలో హైకోర్టు సుమోటోగా తీసుకునే వరకు వచ్చింది. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు చేసిన తప్పిదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ హైకోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువల భూసేకరణలో నష్ట పరిహారం చెల్లింపులో జాప్యం కావడంపై రైతులు కోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ కార్యాలయంలో ఫర్నిచర్ జప్తు చేయాలని నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు మేరకు జప్తు కోసం రైతుల తరపు న్యాయవాది ఎర్రం గణపతి, ఇద్ద రు కోర్టు ఉద్యోగులు, రైతులు ఈ నెల 4 న కలెక్టరేట్‌కు వెళ్లారు. రైతులకు చెల్లించాల్సిన రూ.11,71,747 డిపాజిట్ చేస్తామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

■ ఇదిలా ఉండగా కలెక్టరేట్‌కు జప్తు కోసం వచ్చిన న్యాయవాది, కోర్టు ఉద్యోగులు న్యూసెన్స్ సృష్టించారంటూ అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్ నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. కలెక్టరేట్ వ్యవస్థను అభాసుపాలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. దీంతో న్యాయవాదులు వరుసగా మూడురోజులు ఆందోళనలు చేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ సైతం హైదరాబాద్‌లో ఆందోళనలకు దిగడంతో, ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ కలుగజేసుకుని వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించారు. కోర్టు తీర్పు అమలును అడ్డుకోవడంతో పాటు రైతులకు పరిహారం ఇవ్వకుండా, కోర్టు ఉద్యోగులు, న్యాయవాదిపై తప్పుడు కేసు పెట్టడమేమిటని సీరియస్ అయ్యారు. ఈ కేసు దర్యాప్తును నిలిపేశారు. ఇందుకు సంబంధించి తీర్పును ఫిబ్రవరి 23వ తేదీకి వాయిదా వేశారు.

■ 1963లో గోదావరి నదిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభించారు. 1977లో పనులు పూర్తయ్యాయి. తరువాత ఎస్సారెస్పీ కాలువల నిర్మాణ పనులకు భూసేకరణ చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు 1998లో ప్రభుత్వం పరిహారం చెల్లించింది. పరిహారం తక్కువ మొత్తంలో చెల్లించడంతో బాల్కొండ జోన్‌కు చెందిన భూములు కోల్పోయిన 44 మంది రైతులు 2003లో కోర్టును ఆశ్రయించారు. భూనష్టపరిహార దావాలో వారికి అనుకూలంగా 2012, ఆగస్టు 13న తీర్పు వచ్చింది. తీర్పు అమలు కోసం రైతులు పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం రూ.62,85,100కు గాను 2019 అక్టోబర్ 24న రూ.51,13,353లను కలెక్టర్ ద్వారా కోర్టులో డిపాజిట్ చేశారు.అయితే మిగతా రూ.11,71,747 డిపాజిట్ చేయలేదని మరో అమలు పిటిషన్ వేశారు. ఈ క్రమంలో నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి, కలెక్టర్ కా ర్యాలయ ఫర్నిచర్‌ను కోర్టు బెయిలిఫ్‌ల ద్వారా జప్తు చేయాలని 2022, అక్టోబర్ 31 తీర్పునిచ్చారు.

‘హరితహారం’పై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం
- ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు



సుభాష్‌నగర్ : హరితహారం నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడపల్లి, నిజామాబాద్ రూరల్ మండలాల ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లతోపాటు జానకంపేట్ ఫీల్డ్ అసిస్టెంట్, మల్కాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ హరితహారం, మన ఊరు - మన బడి, కంటి వెలుగు కార్యక్రమాలపై వీసీలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జానకంపేట్ నుంచి అబ్బాపూర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ అస్తవ్యస్తంగా ఉందన్నారు. మన ఊరు-మన బడి ప్రగతిపై సమీక్షిస్తూ, ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి వెంటనే ఎఫ్‌టీవోలు జెనరేట్ చేయాలని ఏఈలను ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే ఏఈలనుసస్పెండ్ చేస్తానన్నారు. ఈనెల 25 నాటికి పూర్తయిన పనులన్నింటికీ ఎఫ్‌టీవోలు సిద్ధం కావాలన్నారు. ఎంపిక చేసిన బడుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. కంటివెలుగును విజయవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. వీసీలో జెడ్పీ సీఈవో గోవింద్, మెప్మా పీడీ రాములు, జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కథనోత్సాహం

- అన్నదాతకు అండగా.. ‘సాక్షి’ అక్షర సమరం
- మాస్టర్ ప్లాన్‌పై వరుస కథనాలు



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సాగించిన ఉద్యమానికి ‘సాక్షి’ అండగా నిలిచింది. భూమిని నమ్ముకుని జీవిస్తున్న అన్నదాతలకు నిత్యం అండగా ఉంటూ ‘కథనోత్సాహం’తో అక్షర పోరు సాగించింది. ‘చిక్కుముడుల మాస్టర్ ప్లాన్’ అంటూ డిసెంబర్ 2న ప్రచురితమైన కథనంతో ముసాయిదాలోని లొసుగులు వెలుగులోకి వచ్చాయి. మాస్టర్ ప్లాన్‌లో ఏముందో అంటూ ముసాయిదాలో పేర్కొన్న చాలా అంశాలను ప్రముఖంగా ప్రచురించడంతో బాధి త రైతులు జాగృతమయ్యారు. సుమారు యాభై రోజులు అలుపెరుగని పోరు సలిపారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలకు ప్రాధాన్యతనిస్తూ, రైతుల ఆవేదనకు ‘సాక్షి’గా నిలిచింది. ఉద్యమంలో పాల్గొన్న అన్నివర్గాలు, పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అందరి మన్ననలు అందుకుంది. మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. భూమికోసం సాగించిన సమరంలో తమకు దన్నుగా నిలిచిన ‘సాక్షి’కి రైతన్నలు కృతజ్ఞతలు తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌పై రైతన్నల విజయం

- వెనక్కి తగ్గిన సర్కారు
- ముసాయిదా రద్దు కోసం ఏకగ్రీవ తీర్మానం చేసిన బల్దియా
- ప్రక్రియ నిలిపివేస్తున్నామని ప్రభుత్వ ప్రకటన
- సంబురాలు చేసుకున్న రైతులు



అడ్లూర్‌లో సమావేశమైన రైతు జేఏసీ ప్రతినిధులు

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి, మాస్టర్ ప్లాన్ ముసాయిదా రద్దు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌లు మీర్జా హఫీజ్ బేగ్, మోటూరి శ్రీకాంత్, అన్వర్ హైమద్ తీర్మానాన్ని బలపరిచారు. దానిని మిగతా సభ్యులందరూ ఆమోదించారు. తాము పంపిన ముసాయిదా ప్లాన్ కాకుండా మార్పు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఇచ్చిన ఢిల్లీకి చెందిన డిజైన్ డెవలప్‌మెంట్ ఫోరం(డీడీఎఫ్), డీటీసీపీ, మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ రమేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

ప్రజల అభిప్రాయం మేరకు..

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్ ముసాయిదా ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం ఆయన కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌లతో సమావేశమయ్యారు. ముసాయిదా ప్రక్రియను నిలిపివేస్తున్నామన్నారు. విలీన గ్రామాల ప్రజల అభిప్రాయాల మేరకు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని పేర్కొన్నారు. రైతుల భూములు ఎక్కడికీ పోవన్నారు.

రైతుల్లో ఆనందం..

రైతు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అడ్లూర్ గ్రామంలో రైతులు అత్యవసర సమావేశం నిర్వహించారు. రైతులు, జేఏసీ ప్రతినిధులు ఉద్యమంపై సుదీర్ఘంగా చర్చించారు. మాస్టర్‌ప్లాన్ రద్దు కావడంతో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ 50 రోజులుగా పోరాటంలో పాల్గొన్న రైతులు, వారి కుటుంబ సభ్యులతోపాటు బీజేపీ నేత వెంకటరమణారెడ్డి, ఇతర పార్టీల నాయకులు, సంఘాలు, జర్నలిస్టులకు రైతు జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషించారంటూ జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

యాభై రోజుల పోరాటం..

కామారెడ్డి పట్టణ విస్తీర్ణం పెరిగింది. అందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు మున్సిపల్ పాలకవర్గం ప్రక్రియ చేపట్టింది. డీటీసీపీ, ఢిల్లీకి చెందిన డీడీఎఫ్ సంస్థలు కలిసి రూపొందించిన ముసాయిదాపై మున్సిప ల్ అధికారులు పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కొందరు రైతులు మాస్టర్ ప్లాన్‌పై మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌తో తీవ్రంగా నష్టపోతామని గ్రహించిన రైతులు, విలీన గ్రామాల ప్రజలు రైతు జేఏసీగా ఏర్పాటై పోరుబాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం ముట్టడి, దీక్షలు, నిరసనలు, భిక్షాటన, ధర్నాలు, రాస్తారోకోలు, కుటుంబసభ్యులతో దీక్షలు, రెండు రోజుల పాటు కలెక్టరేట్ ముట్టడి.. ఇలా రోజూ ఆందోళనలు కొనసాగించారు. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రైతు రాములు ఆత్మహత్యతో అన్నదాతల్లో ఆగ్రహం మరింత పెరిగింది. ఆత్మహత్య చేసుకున్న రాములు మృతదేహంతో జిల్లాకేంద్రంలో ఆందోళన చేశారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఆందోళనలో బీజేపీకి చెందిన మెదక్ ఎమ్మెల్యే రఘునందన్ రావు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. వినతిపత్రం తీసుకోవడానికి కలెక్టర్ రాకపోవడంతో మరుసటి రోజు కామారెడ్డి నియోజకవర్గ బంద్‌కు రైతులు పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కామారెడ్డికి వచ్చి కలెక్టరేట్ ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్త త నెలకొంది. ఈ సందర్భంగా 140 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. సంక్రాంతి పూటా రైతులు రోడ్లపైనే నిరసనలు కొనసాగించారు. రైతు జేఏసీ ప్రతినిధులు సమావేశమై విలీన గ్రామాల కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 19వ తే దీని డెడ్‌లైన్‌గా ప్రకటించారు. పట్టణంలోని 49 మంది కౌన్సిలర్లను వారి ఇళ్ల వద్ద కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. రద్దు కోసం తీర్మానం చేయకపోతే 20న కామారెడ్డిలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మరోవైపు రైతులకు మద్దతుగా బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు రాజీనామా లేఖలివ్వడం, కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజీనామా చేస్తామని ప్రకటించడంతో అధికార పార్టీ కౌన్సిలర్లపై ఒత్తిడి పెరిగిపోయింది.



ప్రజల కోసమే రద్దు నిర్ణయం..

- మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి

కామారెడ్డి టౌన్: కౌన్సిల్ సమావేశం ముగిసిన అనంతరం చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి విలేకరులతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ రద్దు కోసం రైతులు నెలన్నరపాటు ఆందోళనలు చేశారన్నారు. వారి కోసమే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని తీర్మానించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షాన ఉంటుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బ్యాక్‌లాగ్, రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలో 2465 మంది విద్యార్థులకు 2334 మంది హాజరయ్యారని కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆమె తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టరు రెగ్యులర్ పరీక్షలో 4362 మందికి 3918 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ)ల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ (డీసీవో) బి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని డీసీవో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.in, www.tsswreisjc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాహనాల వేలం

బోధన్‌టౌన్: బోధన్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో శుక్రవారం 13 ద్విచక్ర వాహనాలకు, రెండు ఆటోలకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటకు ఎక్సైజ్ సూపరింటిడెంట్ మల్లారెడ్డి హాజరై పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ బోధన్ ఎక్సైజ్ సీఐ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 15 వాహనాలకు వేలం నిర్వహించామని, రూ.1,54,580 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ వేల పాటలో వచ్చిన ఆదాయాన్ని చాలానా రూపంలో బ్యాంకులో జమ చేస్తామన్నారు. సీఐ రూప్‌సింగ్, ఎస్సై బాలయ్య, సిబ్బంది ఉన్నారు.


సారా విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

నిజాంసాగర్: జుక్కల్ మండలం గుండూర్ చౌరస్తాలో నాటు సారా విక్రయదారునిపై శుక్రవారం బి చ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు.నాటుసారా విక్రయిస్తున్న కిషన్‌ను అరెస్ట్ చేశారు.బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, కానిస్టేబుల్ శ్రీధర్ ఉన్నారు.

మట్కా ఆడుతున్న ఇద్దరు..

ఖలీల్‌వాడి: నగరంలోని నటరాజ్ థియేటర్ వద్ద మట్కా ఆడుతున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. థియేటర్ వద్ద మట్కా ఆడుతున్నారనే సమాచారం మేరకు వన్ టౌన్ ఏఎస్సై దత్తాద్రి సిబ్బందితో దాడి చేశారు. మట్కా ఆడుతున్న షేక్ కుర్షీద్, షేక్ ముబీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,220 స్వాధీనం చేసుకున్నారు.

ఫొటో ఫోర్ వీలర్.. చలాన్ టూ వీలర్‌కు..



కామారెడ్డి అర్బన్: ట్రాఫిక్ చలాన్లతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం భిక్కనూర్ పోలీసులు పంపిన చలాన్‌తో ఓ ద్విచక్ర వాహనదారుడు అయోమయానికి గురయ్యాడు. టీఎస్ 16 ఈఆర్ 7208 నంబర్ గల బజాజ్ సిటీ 100 ద్విచక్రవాహనం డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మానసది. తామెప్పుడు భిక్కనూర్ వైపు రానప్పటికి తమ బండిపై చలాన్ రావడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా చలాన్ ఫొటో మాత్రం అదే నంబర్‌తో ఉన్న కారుది కావడం గమనర్హం. అధిక వేగంతో డ్రైవింగ్ పేరిట రూ.1,035 జరిమానా విధించారు. ద్విచక్ర వాహనం నంబర్‌పై నాలుగు చక్రాల వాహనం ఎలా ఉంటుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

అట్టహాసంగా టీఎల్‌ఎం మేళా

- 290 ప్రాజెక్టుల ప్రదర్శన
- బోధనోపకరణాలతో సులువుగా నేర్చుకోవచ్చు : జెడ్పీ చైర్మన్



ప్రదర్శనలు తిలకిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బోర్గాం(పి) పాఠశాలలో జిల్లాస్థాయి టీచింగ్, లెర్నింగ్(టీఎల్‌ఎం) మేళా అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా బోధించేందుకు టీఎల్‌ఎం మేళాలు నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసిలో 290 ప్రాజెక్టులను ఉపాధ్యాయులు ప్రదర్శించారు. మేళాలో పది ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీఈవో దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రదర్శనలు తిలకించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ..జిల్లా స్థాయి మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు. బోధనోపకరణాలతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమవుతాయని చెప్పారు. ఈ పద్ధతులను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో బోధించే విధంగా చర్యలు తీసుకునేలా డీఈవోను కోరారు. విద్యార్థులను మెరుగైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయన్నారు. డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం కోసం కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి, డీసీఈబీ కార్యదర్శి సీతయ్య, కో ఆర్డినేటర్ గంగకిషన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, శ్రీకాంత్, ధర్మేంద్ర, రాజగంగారెడ్డి, సత్యనారాయణ, సత్యానంద్, రమేష్, జలంధర్, గోపాలకష్ణ, విజయ్, స్వామి నాయక్, గోపాల్, జమీలుల్లా, కృష్ణవేణి, బద్రీనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

ప్రాజెక్ట్	ఉపాధ్యాయులు
పదమయూరం	రేణుక, హంగర్గ
ఒత్తులు గుర్తించడం	సరిత, రావుట్ల
మానవ శరీరం	శ్రీనివాస్‌గౌడ్, తాళ్లరాంపూర్
సోలార్ సిస్టం	ప్రమోద్‌రెడ్డి, సిద్దాపూర్
వ్యతిరేక పదాలు	రజిత, బొప్పాపూర్
మల్టీపర్పస్ టీఎల్‌ఎం	సువర్ణ, కొత్తపల్లి
ప్లే విత్ షేప్	సాగర్, రామడుగు
జియో బోర్డు	శ్యాం, ఇస్సాపల్లి
ఉర్దు పదాల గుర్తింపు	నఫీజ్ సుల్తానా, పోతంగల్
లెటర్ రైటింగ్, పదాల ఉపయోగం	అల్తాపుద్దీన్ పర్వేజ్, హంగర్గ

స్వాహా చేసిన సొమ్ము అందజేత

- బాధితులకు డబ్బు ఇచ్చేస్తున్న మాజీ బీపీఎం
- డిపాజిట్‌దారులకు రికార్డుల్లో రాయని డబ్బు చెల్లిస్తున్న వైనం

మోర్తాడ్: తపాల శాఖలో చోటు చేసుకున్న అక్రమాలపై ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తుంది. డిపాజిట్‌దారుల నుంచి వసూలు చేసిన సొమ్మును తన సొంతానికి వాడుకున్న తపాల ఉద్యోగి అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు సొమ్ము వాపసు చేసున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఏర్గట్ల మండలం తొర్తి బీపీఎం సుకన్య సమృద్ధి యోజన పథకం, రికరింగ్ డిపాజిట్ల సొమ్మును భారీ మొత్తంలో తన జేబులో వేసుకోగా ఈ అక్రమాలు అక్టోబర్‌లో వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో హడావుడి చేసిన తపాల శాఖ ఉన్నతాధికారులు విచారణను పూర్తి చేయకుండా సాగదీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా డిపాజిట్‌దారులు చెల్లించిన సొమ్ములో వాడుకున్న చిన్న మొత్తాలను సదరు ఉద్యోగి తపాల శాఖకు సంబంధం లేకుండా వాపసు చేస్తున్నాడు. తాను పొరపాటు చేశానని తన తప్పు తెలుసుకుని రికార్డులలో రాయకుండా సొంతానికి వాడుకున్న సొమ్మును చెల్లిస్తున్నానని డిపాజిటర్లకు ఉద్యోగి చెబుతున్నాడు. తపాల శాఖ ఇప్పటి వరకు రూ.1.20లక్షలు రికవరి చేసింది. ఇంకా రూ.40లక్షల వరకు సొమ్మును రికవరి చేసి డిపాజిట్‌దారులకు వాపసు చేయాల్సి ఉంది. తపాల శాఖ నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి ఎక్కువ సొమ్ము వాడుకుంటే క్రిమినల్ కేసును ఎదుర్కోవాల్సి వస్తుంది. కేసు నుంచి తప్పించుకోవడంతో పాటు మళ్లీ ఉద్యోగం దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో సస్పెండ్‌కు గురైన ఉద్యోగి ఎవరి సొమ్ము వారికి వాపసు చేస్తున్నాడని తెలిసింది. అక్రమాల మొత్తం భారీగా ఉన్నా తపాల శాఖ విచారణ పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విచారణ పేరుతో అధికారులు కాలయాపన చేస్తుండటం ,రహస్యంగా డబ్బుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుండటంతో అధికారులకు ముడుపులు ముట్టి ఉంటాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విచారణ పూర్తి కాలేదు

ఏర్గట్ల మండలం తొర్తి బీపీఎం అక్రమాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఇంకా విచారణ పూర్తి కాలేదు. తపాల శాఖకు సంబంధం లేకుండా డబ్బులు పంపిణీ విషయం మా దృష్టికి రాలేదు. రికార్డుల్లో నమోదు చేసి ఉన్న మొత్తానికి తపాల శాఖ బాధ్యత వహిస్తుంది.

– ఉమామహేశ్వరరావు, సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్

హత్యాయత్నం కేసులో సర్పంచ్, మరో ముగ్గురికి ఐదేళ్ల జైలు

బోధన్: హత్యాయత్నం కేసులో ఓ గ్రామ సర్పంచ్‌తో పాటు మరో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తు బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్ జడ్జి దేవాన్ అజయ్ కుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. జరిమానా కట్టక పోతే మరో 15 రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన వివరాలు.. బోధన్ మండలం ఖండ్గాం గ్రామ శివారులో ఇదే గ్రామానికి చెందిన జాదవ్ రమేష్‌కు పంట పొలం ఉంది. ఈ పొలం మీదుగా గ్రామ పంచాయతీకి సంబంధించిన వాటర్ ట్యాంకర్ రాకపోకలతో పంటలపై దుమ్ముధూళి పడుతోంది. 2021 జనవరి 28న రమేష్ పెద్ద కుమారుడు సూర్యకిరణ్ పంటపై పడిన దుమ్ముధూళిని వాటర్ ట్యాంకర్ నీటితో శుభ్రం చేయాలని సర్పంచ్ హెచ్ లాలు వద్దకు వెళ్లి కోరాడు. సర్పంచ్‌తో పాటు అక్కడే ఉన్న సర్పంచ్ సోదరుడు సాహెబ్‌రావు, మరో ఇద్దరు వ్యక్తులు మీసాలే అనిల్, సునీల్ దానికి నిరాకరించి సూర్యకిరణ్‌తో గొడవ పడ్డారు. ఆయనను కొట్టి, సెల్‌ఫోన్‌ను పగులకొట్టారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పి సూర్యకిరణ్ అక్కడి నుంచి సోదరుడు జాదవ్ విక్రం (రమేష్ తమ్ముడి కొడుకు)ను వెంట తీసుకొని బైక్‌పై బయలుదేరాడు. దీంతో సర్పంచ్ లాలు తన కారును తీసుకెళ్లి బైక్‌ను ఢీకొట్టి వారిని హతమార్చుమని అనిల్‌కు చెప్పాడు. సర్పంచ్ చెప్పిన విధంగా అనిల్ కారులో బైక్‌ను వెంబడించి గ్రామ శివారులోగల బీరప్ప గుడి వద్ద ఓవర్‌టెక్ చేసి ఎదురుగా కారుతో ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న సూర్యకిరణ్ ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా, విక్రం స్వల్పంగా గాయపడ్డారు. మరుసటి రోజు రమేష్ బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదైంది. విచారణ చేపట్టిన న్యాయమూర్తి సర్పంచ్‌తో పాటు మిగిలిన ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

మృతులంతా దగ్గరి బంధువులు

భిక్కనూరు: మండలంలోని అంతంలపల్లి గ్రామానికి చెందిన నలుగురు ఏడాదిలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. ఈ నలుగురు కూడా దగ్గర బంధువులు కావడం విస్మయానికి గురి చేస్తోంది. ఈ నెల15న భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్రోల్ల బాల్‌రాజు మృతి చెందాడు. గత ఏడాది ఆగస్టు 5న కర్రోల్ల సిద్దయ్య తన ద్విచక్రవాహనంపై అంతంపల్లికి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన భార్య సిద్దవ్వ తమ బంధువుతో కలిసి ద్విచక్రవాహనంపై మృతదేహన్ని చూసేందుకు వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయల పాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏడాది క్రితం కామారెడ్డి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్రోల్ల వినోద మృతి చెందింది. కర్రోళ్ల వినోదకు ఆగస్టు5న మృతి చెందిన సిద్దయ్య స్వయాన కాగా, సిద్దవ్వ తోటి కోడలు కావడం గమనార్హం. తాజాగా జనవరి 15న మృతి చనిపోయిన బాలయ్య వీరికి దగ్గరి బంధువు. ఒకే గ్రామంలో నలుగురు దగ్గరి బంధువులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం చర్చనీయాంశం అయింది.

అదుపు తప్పిన బైక్

- ఇద్దరికి గాయాలు

గాంధారి: మండలంలోని నేరల్ తండా సమీపంలో శుక్రవారం బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డట్లు 108 ఈఎంటీ సురేష్, పైలట్ సతీష్ తెలిపారు. చందూరు మండలం కారేగాంకు చెందిన కిశోర్, శ్రీను బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని 108 లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోసానిపేట ఎల్లమ్మగుడిలో చోరీ

రామారెడ్డి: మండలంలోని పోసానిపేటలో గ్రామం ఎల్లమ్మ గుడిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం తాళాలు పగులగొట్టి ఎలమ్మ విగ్రహం మీద ఉన్న 3 గ్రాముల బంగారు పుస్తెల తాడు, వెండి మట్టెలు, బంగారు బొట్టు బిల్లలను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తి సీసీ కెమెరాలో నమోదైనట్లు సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి తెలిపారు.

భూమి తగాదా విషయంలో రైతు ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయపల్లి గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ భూమి తగాదా విషయంలో మనస్తాపం చెంది శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన కామ సురేష్(21)కు ఇతరులతో భూమి విషయంలో తగాదా నడుస్తోంది. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు సురేష్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional sponsor

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 9010418884

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

పెళ్లి చేసుకుంటానని మోసం



హిందూ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

- ఆస్పత్రిలో పని చేసే యువతిని గర్భవతి చేసిన ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్
- నిందితుడిపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల రాస్తారోకో

బాన్సువాడటౌన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ గర్భవతిని చేశాడు. తీరా పెళ్లి చేసుకోకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న ఓ యువతిని బాన్సువాడకు చెందిన ప్రైవేటు అంబులెన్సు నిర్వాహకుడు షఫీ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు షఫీని మూడు రోజుల క్రితమే గుట్టు చప్పుడు కాకుండా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. విషయం తెలుసుకున్న హిందూ వాహిణి, హిందు పరిరక్షణ సమితి, బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఆస్పత్రిలో చాలా కాలంగా ప్రైవేటు అంబులెన్సు నిర్వాహకులు, డ్రైవర్లు తిష్ట వేసి అమ్మాయిలను మభ్యపెడుతు, మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై గతంలో చాలా సార్లు పోలీసులకు, ఆస్పత్రి సుపరింటెండెంట్‌కు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో అమ్మాయిలపై జరుగుతున్న మోసాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డి ఆందోళనకారులను సముదాయించారు. నాయకులు సాయికిరణ్, పటేల్ ప్రసాద్, పైడిమల్ లక్ష్మీనారాయణ, కొత్తకొండ భాస్కర్, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, గుడుగుట్ల శ్రీనివాస్, రాజాసింగ్, అశ్విన్, సాయిబాబా, గోపాల్, విఠల్‌రెడ్డి, చీకట్ల రాజు, అనిల్ పాల్గొన్నారు.

కుక్క పిల్లకు పాలిచ్చిన పంది

భిక్కనూరు: భిక్కనూరు మండలం శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో కుక్క పిల్ల పంది పాలు తాగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సాధారణంగా పందులను చూస్తే కుక్కలు మొరుగుతూ వెంట పడుతాయి. కానీ శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో కుక్క పిల్లకు పంది పాలివ్వడం పలువురు ఆసక్తిగా చూశారు.



షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్లు దగ్ధం

సిరికొండ: మండలంలోని సర్పంచ్ తండాలో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో మూడు రేకుల షెడ్లు దగ్ధమయ్యాయి. కేతావత్ సంగ్య ముగ్గురు కుమారులు బన్నాజీ, మహిపాల్, రవి తమ కుటుంబ సభ్యులతో రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. వాటిలో ఎవరు లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి మంటలు చేలరేగి ఉంటాయని భావిస్తున్నట్లు సర్పంచ్ సర్యానాయక్ తెలిపారు. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పినప్పటికి రేకుల షెడ్లు పూర్తిగా కాలిపోయాయని ఆయన తెలిపారు. మహిపాల్ భూమి అమ్మగా వచ్చిన లక్షన్నర రుపాయలు, వారి బంధువులకు గల్ఫ్ వీసాకు చెల్లించేందుకు తెచ్చిన డబ్బులు మంటల్లో కాలిపోయాయని తెలిపారు. అగ్ని ప్రమాదంలో మూడు కుటుంబాలకు సంబంధించి రూ.9 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ గఫార్ మియా తెలిపారు.

బొప్పాపూర్‌లో కిరాణా షాపు..

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్‌లో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి కిరాణ షాపు కాలిపోయింది. ఖాజాసాబ్‌కు చెందిన షాపు దగ్ధం కావడంతో రూ.లక్ష మేర ఫర్నిచర్, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

కేజీవీల్ ట్రాక్టర్..

కోటగిరి: కోటగిరి ఠాణా పరిధిలోని ఎత్తొండ – యాద్గార్‌పూర్ రోడ్డు పక్కన నిలబెట్టిన ఓ కేజీవీల్ ట్రాక్టర్‌ను శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఎత్తొండ గ్రామానికి చెందిన ఓ రెండు కుటుంబాల నడుమ భూమి కొనుగోలుకు సంబంధించిన వివాదం కొనసాగుతోంది. కోటగిరి గ్రామానికి చెందిన కూచి శ్రీనివాస్ తన ట్రాక్టర్‌తో ఆ భూమిని దమ్ము చేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు దుండగులు నిప్పు పెట్టారు. ట్రాక్టర్, భూ యజమానుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒకరి ఆత్మహత్య

లింగంపేట: మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన పోగు సాయిబాబా(34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. సాయిబాబా 12 ఏళ్ల క్రితం మెదక్ జిల్లా కొడపాక గ్రామం నుంచి లింగంపల్లికి ఇల్లరికం వచ్చాడు. అతనికి భార్య సునిత ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయిబాబా కొంత కాలంగా మద్యానికి బానిసై రోజు తాగుతున్నాడు. కూలీ చేసుకోగా వచ్చిన డబ్బులు పూర్తిగా తాగేసేవాడు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పలుమార్లు చెప్పినా పట్టించుకునేవాడు కాదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయిబాబా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సాయిబాబా(ఫైల్)

క్రైం కార్నర్

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



ఖలీల్‌వాడి: బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఏసీపీ ఆఫీసులో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన బద్‌నాథ్ మోహన్ బైక్ ఈ నెల 17న పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం శివాజీ చౌక్ వద్ద ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేయగా రెండు బైక్‌లపై దుబ్బ నుంచి శివాజీ చౌక్ వైపు వస్తున్న ఇద్దరు పోలీసులని చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకొని విచారించగా బైక్‌లను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరు ఆ రెండు బైక్‌లనే కాకుండా మరో బండిని కూడా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. బోధన్ హాస్పిటల్ వద్ద, కాలూర్ గ్రామంలో, దుబ్బ ప్రాంతంలో బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్లు అఫ్సర్, చామింద్, గంగకుమార్, బాబును ఏసీపీ వెంకటేశ్వర్ అభినందించారు.

చికిత్స పొందుతూ ఇటుక బట్టీ కార్మికుడి మృతి

ధర్పల్లి: మండలంలోని హోన్నాజిపేట్‌లో ఇటుక బట్టీలో పని చేసే కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. హోన్నాజిపేట్ గ్రామంలోని ఇటుక బట్టీలో నాందేడ్ జిల్లా బొకర్ మండలం జంకాపూర్ తండాకు చెందిన సీతారాం జాదవ్ (60) కొన్ని రోజులుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం పనులు ముగించుకొని తన కొడుకుతోపాటు గ్రామంలోకి వెళ్లి వంట సామగ్రి తీసుకున్నారు. అనంతరం ఇటుక బట్టి యజమాని ట్రాక్టర్‌పై బట్టీకి వెళ్తుండగా మూల మలుపు వద్ద ట్రాక్టర్‌పై నుంచి సీతారాం జాదవ్ ఎగిరి కింద పడ్డాడు. అతనిపై నుంచి ట్రాక్టరు ఎక్కిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆయన మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరు..

భువనగిరి: రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. నిజామాబాద్‌కు చెందిన కలకోటి అభిలాష్(32) శుక్రవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఉదయం భువనగిరి మండలం పగిడిపల్లి–భువనగిరి రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ 7836035286, 8901923173. [W-775802]

ఆయుర్వేదాలయం

■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి–సెల్: 7738897455 [K-1141937]

BUSINESS OFFER

■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

WANTED

■ WANTED AUTO CAD OPERATOR Q: ITI DM Civil Female Only. Cont: AN Builders, NZB. Cell: 9849246064. [Z-772129]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7022254496. [M-1190551]

■ అంజన్న హోమ్‌కేర్ పెద్దవారికి పేషెంట్ కేర్ / ఇంటి / వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661. [HA-900]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.